

మామూలు చోటే. మామూలు సభ్యులే — చెంచయ్యా, వెంకట్రావూ, శాస్త్రీ వగైరాలు — కాఫీహోటల్లో ఎవరి బిల్లువాళ్ళం చెల్లించాము అంచేతనేమో ఒకరికొకరు తీసిపోవటంలేదు: చర్చ — సత్యా అహింసలమీద ప్రారంభమై, నీతి అవినీతి దాటి, ఆస్తికతా నాస్తికతాలోకి దిగింది. చెంచయ్య దేవుణ్ణి దెయ్యాన్నీ — దేన్నీ వొప్పుకోటంలేదు. కళ్ళకి చూపించమంటున్నాడు!

వెంకట్రావు వేదాంతి. మాలాంటి నాస్తికుల్ని చూసి జాలిపడటమే కాదు; క్షమించమని భగవంతుణ్ణి కళ్ళు మూసుకు ప్రార్థిస్తాడు కూడా. ఎప్పటికైనా మన దేశం పాశ్చాత్యదేశాలకి ముక్తి కలిగిస్తుందని ఆయన నమ్మకం. మన దేశం భౌతికంగా స్వాతంత్ర్యం కోల్పోయినా, ఆధ్యాత్మికంగా యింకా పోలేదని ఆయన వాదన. గాంధీగారిని ఉదహరించి తప్ప మాట్లాడడు. అదేం ఖర్మమో గాంధీగారు చెప్పితే బాగా ఉండే మాటలు ఈయన నోట పడి, పనికిమాలినవై పోతున్నై — ఇదే కాబోలు క్షేత్ర మహత్యం!

శాస్త్రిగారొక అతి వాస్తవిక రచన! తనకు తప్ప ఎవ్వరికీ అర్థం కాడు. ఎంతోమంది సాహిత్య పహిల్వానులు ఆయనచేత 'చిన్' అయిపోయారు. మూగవాడిచేత మాట్లాడిస్తాడు. ఆయనకి వొక సిద్ధాంత మంటూ లేదు!

మేము యిద్దరమై పోయాము. వెంక

చక్రపాణి

ట్రావు తగ్గిపోతున్నాడు. అంచేత శాస్త్రి గారు అటు కలిసి, బాలన్సు చేశారు :

"మీ రెన్నయినా చెప్పండి. తృప్తి అనేది మన వేదాంతానికి మూలసూత్రం. అది ఉండబట్టే మనం ఎన్ని తుపాన్లు వచ్చినా లెఖ్ఖ చెయ్యకుండా తుంగపాచలాగా తల ఎత్తుకుని ఉన్నాం. ప్రపంచకంలో ఎన్ని సామ్రాజ్యాలు నాశనం కాలేదు ? ఎన్ని జాతులు పేరులేకుండా పోలేదు ? ఈనాడు మన ఇంకా నిలిచిఉన్నా మంటే, మనకు ఉగ్గుబాలతో సంక్రమించిన సంస్కారం మూలానే ! పాశ్చాత్యులకి తృప్తిలేదు. అందుచేతనే అలా కొట్టుకు చస్తున్నారు. మన కున్న సంస్కారంలో నూరోవంతున్నా వాళ్ళు ఆయుధాలు పార వేసి, బైబిలు చేతపట్టుకు కూర్చునేవాళ్లు."

"అలాగా :" అని సాగదీశాడు చెంచయ్య.

"కాక !– ఈ యుద్ధం కాగానే నానా జాతిసమితి ఉండదు. దానికి బదులు హిందూదేశంనించి మాబోటివాళ్ళం కొంతమందిమి పోయి, ప్రతిదేశంలోనూ హిందూ వేదాంతాన్ని బోధిస్తాము – ఇదే ఆఖరియుద్ధం ! ఇక యుద్ధాలు ఉండవు – ఏమంటారు. వెంకట్రావుగారూ ?" అన్నారు శాస్త్రిగారు.

"దీనికి నేను వొప్పుకోను !" అన్నాడు చెంచయ్య.

"ఎందుకని ?"

"మన కున్న ఒక్క సంపదా, రేడర్ ఆయుధం పాశ్చాత్యుల కిచ్చివేస్తే, మన మేమైపోతాము ?" అన్నాడు చెంచయ్య.

"శాస్త్రిగారూ ! ఎంతో కాలంనించి పెద్దలు దీన్ని ఎవ్వరికీ యివ్వకుండా కాపాడుకుంటూ వస్తున్నారు. ఈనాడు మీరు ఆ కాస్తా కిరస్తానీవాళ్ళ కిస్తే, మన గతేమిటి ?" అన్నాను నేను.

"అలాగా ! ఐతే మీ కానందం వద్దన్నమాట !" అన్నారు శాస్త్రిగారు.

"ఎందు కొద్దు ? తప్పకుండాకావాలి" అన్నాము ఇద్దరం.

"ఐతే త్యాగంలేంది ఆనందం లభించదు."

"అఖ్ఖర్లేదు ! మేము పీసంకూడా త్యాగం చెయ్యకుండా ఆనందం పొందుతున్నాము"

"అదే మీ పొరపాటు : మీరు ఇంత సేపుమాట్లాడితిరే. మీవిజ్ఞానాన్ని వృథాగా పంచిపెట్టితిరే, ఏం లాభం చూసుకుని ? ఏమీలేదు. అందుకనే అది త్యాగంకిందికి వస్తుంది. మేముయింత సేపూ మీ మాటలు విని మీకు బదులుగా ఆనందాన్ని యిచ్చాము ఇంకా అప్పుడప్పుడూ ఎదురు చెప్పాము కాని, లేకపోతే మేము మీ కిచ్చిన ఆనందాన్ని మీరు బ్రహ్మానందం లోకి మార్చుకునేవారు."

శాస్త్రిగారు ఎన్ని ధర్మాలు మాట్లాడినా, ఆయన చేసింది ధర్మయుద్ధంకాదు. ఐనా, ఆయన ప్రయోగించిన బ్రహ్మాస్త్రం

వృథాపోలేదు. మా తలలు తుంచలేక పోయినా వంచింది.

ఇంతలో మా పాలిటి దేవుడిలా ప్రకాశరావు వచ్చి అడ్డుపడ్డాడు.

"మీరు విన్నారా ? — శేషమ్మ కూతురికి పోతురాజు పూనాడు !" అన్నాడు.

"ఏ పోతురాజు ?" అన్నాను నేను, ఏదో ఒకటి మాట్లాడా లని.

"పోతురాజు కాదు పున్నయ్య కొడుకు !" — అన్నాడు చెంచయ్య.

"ఏమి చేమిటీ ? మళ్లీ చెప్పు" అన్నాడు శాస్త్రి.

ప్రకాశరావుని సరిగ్గా చెప్పనివ్వలేదు మేము. మధ్యనే ఎవరిపాట వాళ్ళు పాడే వాళ్ళం. ఒకరి కొకరికి శ్రుతిలేదు.

అరగంట వాగినతరవాత ఒక అభిప్రాయాని కొచ్చారు అంతా. వెళ్ళి చూసిరావాలని నిర్ణయించారు. నేను అర్జంటు పని ఉందని వంక పెట్టి పోలేదు.

*　*　*

సాయంత్రం చెంచయ్య కనిపించాడు. అతనిధోరణి చూస్తే పోతురాజు యితన్నే ఆవేశించినట్టుగా ఉంది.

"నాన్ సెన్స్ ! అంతా దగా ! పోతురాజొచ్చి తనకు గుడి కట్టించమని దాని దగ్గర ఏడుస్తాడా ?"

"ఇక్కడ పోతురాజు లేడుగాఅసలు" అన్నాను నేను.

"ఎందుకు లేడూ ? మనం పాలెం పోయే దోవలో లేదూ రాయి, అదే పోతురాజట. అతనే దాన్ని పట్టి అలా పలికిస్తున్నాడట !"

నాకు ఆశ్చర్య మేసింది. నా చిన్నతనం నించీ ఆ రాతిని నేను చూస్తూ ఉండేవాణ్ణి. దాని కింతవర కెవ్వరూ పేరు పెట్టలేదు. గొడ్లు తోలుకుపోయి పిల్లలు దానిమీద కూర్చుంటూ ఉండేవాళ్ళు. నేనెక్కాలా నంటే నే నని చాలమంది దాని కోసం కొట్టుకున్నారు కూడా. గొడ్లూ, పందులూ కూడా దాన్ని రాచుకుంటూ ఉండేవి — దురదగా ఉన్నా, బురదగా ఉన్నా ! ఈ నాటి పోతురాజా అది ! గుడా దానికి ! !

"ఏం చేస్తాం ? మూఢ ప్రజలు. వాళ్ళ అజ్ఞానానికి చింతించాల్సిందే !" అన్నాను.

"ఎవరి అజ్ఞానానికి ? వెంకట్రావుని వేసుకుని శాస్త్రిగారు కూడా అక్కడే కూర్చున్నారు. ఇక ప్రకాశరావు —"

"శాస్త్రిగారికి నమ్మకముందంటావా?"

"ఏమో ! అటువంటివాళ్ళు తోడుంటే వెంకట్రావుల బలం జాస్తీకాదా ?" కాదని ఎలా అనగలను ? అందుకనే చెంచయ్యను చల్లబర్చటానికి అన్నాను:

"ను వ్వెన్నన్నా చెప్పు చెంచయ్యా ! మనలాంటివాళ్లు ఏదో కొద్దిమంది తప్ప, ఎవ్వరూ వెనకటి నమ్మకాలు వదలుకోలేరు. ఉగ్గుబాలతో జీర్ణించినవాళ్ళ మూఢనమ్మకాలు ఇవ్వాళ పోతయ్యా ! వాళ్ళు మనతో కలిసిరావటంలేదని దిగులు పట్టంకంటె గర్వపట్టంమంచిదేమో?"

చెంచయ్యకు ఈ మాటలు బాగా నచ్చినై. తర్వాత ఇద్దరం కలిసి, వాళ్ళ అజ్ఞానాన్ని విమర్శించి తృప్తిపడ్డాము. ఎంత తృప్తి అంటే, పొరుగువాడు దివాళా ఎత్తినా మాకంత ఆనందముండేది కాదు.

* * *

మమ్మల్నీ, మా విమర్శల్నీ ఏమి లెఖ్ఖచెయ్యకుండా భక్తులు గుడి కట్టించేశారు. పూజారిస్థానం శేషమ్మ సంపాదించుకుంది. ఆ గుడి మొదలు పెట్టిన వేళావిశేషమో, లేక శేషమ్మ పూర్వపుణ్యమో (ఈ జన్మలో శేషమ్మ ఏ పుణ్యమూ చెయ్యలేదు, మాకు తెలిసినంతవరకు) పోతురాజు బాగా పాపులర్ అయ్యాడు. దూర దూరాల్నించీ జనం వస్తున్నారు. పాతమొక్కులుంటే చెల్లించటానికీ కొత్తగా మొక్కుకోటానికీ. ఊళ్ళోవాళ్ళకే కాదు నాకుకూడా చుట్టాల తాకిడి ఎక్కువైంది. వాళ్ళదగ్గిర పోతురాజుని విమర్శించటానికి కూడా వీలులేకుండా ఉంది — తిండి పెయ్యలేక తిడ్తున్నాడని అనుకుని పోతారేమోనని!

పోతురాజు ప్రభ నానాటికి వెలిగిపోతున్నది. అనుకోని విధంగా వెంకట్రావుకు ఉద్యోగం దొరికింది... శరభయ్యభార్యకి 35 దో ఏట కడుపు వచ్చిందట. వెంకటస్వామికి పోయినచూపు కొద్దిగా వచ్చిందట... ఇలా రోజు కొక సెన్సేషనల్ న్యూస్ తీసికొస్తున్నాడు శాస్త్రిగారు. 'ఏమంటారు దీనికి?' అని మమ్మల్ని వెటకారం చేస్తున్నాడు. అనేది ఏమీలేక, శాస్త్రిగార్ని చదువుకున్న మూఢునికింద జమకట్టాము.

ఇంతలో వర్షాలు వచ్చినై — కలరాను వెంటబెట్టుకుని. శేషమ్మకి సరికొత్తగా పోతురాజు పూనాడు. తనకి కొలుపులు కొలవకపోతే ఊరంతా విరుచుకుతింటానని బెదిరించాడు. ఊళ్ళో పెద్దలు కొలుపులు కొలుస్తామని ముడుపులు కట్టారు. ఊరంతా పోతురాజును నమ్మినా, మునిసిపాల్టీవాళ్ళు నమ్మలేదు. వాళ్ళ జాగర్త వాళ్ళు పడుతూనే ఉన్నారు. బావుల్లో మందు కలిపారు. తోవలో నుంచుని కనపడ్డవాడికల్లా కలరా వాక్సిన్ యిచ్చారు.. ఇంకా యిస్తూనే ఉన్నారు.

నేనూ, చెంచయ్యా కలరా వాక్సిన్ తీసుకున్నాము. శాస్త్రిగారుకూడా తీసుకున్నారని విన్నాం కాని, వారు ఒప్పుకోలేదు. ముడుపు కట్టానన్నారు — మమ్మల్ని కూడా కట్టమని సలహా యిచ్చారు. చెంచయ్యా నేనూ కలసి శాస్త్రిగారిని చదువుకున్న మూఢునిక్రింద జమకట్టాముకదా అనుకున్నాము.

కలరా అక్కడి కక్కడికీ పాకిపోతున్నది. మా పేటకికూడా వచ్చింది. ఇద్దరు ముగ్గురు జారారుకూడా. నేను డాక్టరుగారిని అడిగి కాంఫర్ 12x తీసుకుని ఒకడోసు వేసుకున్నాను.



"ంగ్రాఫుల్, ఏం బాగా కొన్నారంతే ఈ సుట్టే?"

ఫలితం నేను మంచం మీద కూడా ఆధారపడలేదు. తిండి తగ్గించాను — వేడి పదార్థాలు తప్పితే, ముట్టడం లేదు.

సాయంత్రం శాస్త్రిగారు కనిపించారు పసుపు బొట్టు పెట్టుకుని. "ఏమిటి ఈ వేషం" అన్నాను.

"అమ్మవారి పసుపు" అన్నారు.

"అమ్మవారెక్కడనించి వచ్చింది. క్రొత్తగా?"

"కొత్తగానే వచ్చింది. పోతురాజు ఒక్కడికే కొలుపులు కొలవగూడదట!"

"ఒక్కమాటే పిల్లల్నికూడా తీసుకు రాకపోయారూ?" అన్నాను.

"అవసరమైతే తప్పుతుందా?" అని శాస్త్రిగారు నవ్వుతూ వెళ్ళిపోయారు

ఆ రాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు.. శాస్త్రిగారినీ పోతురాజునీ తలుచుకుంటే. నా వొళ్ళు ఉడికిపోతున్నది.

తెలవారుఝామున గుడ్డికునుకొకటి వేశాననుకుంటాను అంతలో సన్నని ఏడుపుతో నాకు మెలకువ వచ్చింది. జారిపడ్డేనా? సామూహిక రోదనంగా లేదే? — నాకు మళ్ళీ కన్నంటలేదు. తెల్లవారి తెలిసింది — వాడు జారాడట. మా పొరుగున కొత్తకేసు! ఉదయం ఉత్తకాఫీ తీసుకున్నాను. ఇంకేమీ తినలేదు. కాసేపటికి శాస్త్రిగారొచ్చి బలవంతంచేసి యిడ్లీ తినిపించారు. ఇంకో మాటు కాఫీ!

నా కిష్టం లేకపోయినా. శాస్త్రిగారు

పోతురాజుని ఎత్తుకున్నారు. నాకు చాలా కష్టమేసింది.. "సోషలిస్టు స్టేటులోఐతే మీబోటివాళ్ళని ఇలాంటి మూఢనమ్మకాలు ప్రచారం చేస్తున్నందుకు ఉరితీసే వాళ్ళు!" అన్నాను.

"ఆ లెఖ్ఖని ఈ స్టేటులో ప్రచారం చెయ్యకపోతే తీస్తారు!"

శాస్త్రిగారు చెప్పిందాంట్లో యదార్థం లేకపోలేదు, దూరమాలోచిస్తే.

"ఏమైనా రోగిని చికిత్స లేకుండా చంపటం ధర్మంకాదు" అన్నాను.

"చికిత్సతో చంపటంకూడా ధర్మం కాదు. డాక్టర్లు చంపితే ఏం కేసుంది, పోతురాజు చంపితే ఉంటానికి? డాక్టర్లతో నయమైనవాళ్ళు ఉంటే పోతురాజుతో నయమైనవాళ్ళూ ఉండనే వున్నారు."

ఎందుకనో తర్కించటానికి నాకు మనసు పోలేదు; అసలు మనసే బాగోలేదు. ఇంటికొచ్చి, చాలా కొద్దిగా తిన్నాను అన్నం...పొరుగు కేసుకూడా ఫెయిల్ అయేటట్టుగా కనబడుతున్నది.. దానికిసూచన ఇంట్లోవాళ్ళు యిస్తున్నారు.

ఇంట్లో వుండలేకపోయాను ప్రకాశరావు యింటికి పోయి. పేకాట ప్రారంభించాము.

కడుపునొప్పి ప్రారంభమైంది. ప్రకాశరావు పెధవ హల్వా తెచ్చి, మా అందరిచేతా తినిపించాడు. చెంచయ్య కూడా కడుపు పుచ్చుకున్నాడు.

బజారుకు వచ్చి కాఫీ తాగాము కడుపునొప్పి యింకా ఎక్కువైంది డాక్టర్నడిగి Nux 200 తీసుకున్నాను

శాస్త్రిగారు ఏవో వాగించటానికి ప్రయత్నిస్తునే ఉన్నారు, నాకు ఏమీతోచటంలేదు ఇంటికి పోతున్నానని బయల్దేరా. కాని నా మనస్సుమనస్సులోలేదు నాకుతెలియకుండానే చుట్టుతిరిగి పోతురాజుగుడిదగ్గరికి వచ్చాను. చీకటి పడిందు పోతురాజు గుడిముందు కాగడాలు వెలుగుతున్నై. తప్పెట్లూ, పంబజోళ్ళూ, వీరాంగం, గణాచార్లూ...నా వొళ్ళు పులకరించింది. ముఖంమీద వెలుతురు పడకుండా సాధ్యమైనంత దూరంలో నుంచున్నాను. కళ్ళు మూసుకుని చేతులు జోడించి పోతురాజుకు ముడుపు కడతానన్నాను. గత అపరాధాలు క్షమించమని చెంపలు వాయించుకుని చుట్టూచూశాను– ఎవ్వరూ చూడటం లేదుకదా అని! నాకు ధైర్యం చిక్కింది. ఎవ్వరూ చూడటం లేదు. నా పక్కని ఎప్పుడో వచ్చి నుంచున్న చెంచయ్య మాత్రం కళ్ళు మూసుకుని ఇదివరకు నేనున్నస్థితిలోనే ఉన్నాడు. అతని ధ్యానభంగం కాకముందే, నే నక్కడినించి పారిపోయాను

సినిమా క్విజ్ - జవాబులు

1. ఇద్దరు పెళ్లాలు 2. ముగ్గురు కొడుకులు